క్లుప్తంగా

నేడు చాగల్లులో ఉచిత వైద్యశిబిరం

చాగల్లు: స్థానిక టీటీడీ కల్యాణ మండపంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నారు. ఫ్రెండ్స్ మెమోరియల్ అసోసియేషన్, మనం ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ శిబిరంలో రాజమహేంద్రవరానికి చెందిన డెల్టా ఆస్పత్రి వైద్యులు పలు రకాల వ్యాధులకు పరీక్షలు చేస్తారు. నిడదవోలుకు చెందిన జాగృతి కంటి ఆస్పత్రి వైద్యులు కూడా సేవలు అందిస్తారని నిర్వాహకులు తెలిపారు.

వైభవంగా హరిహర క్షేత్రం వార్షికోత్సవం


హరహర క్షేత్రంలోని వేంకటేశ్వరస్వామి

దేవరపల్లి: లక్ష్మీపురం గ్రామంలోని హరహర క్షేత్రం ప్రథమ వార్షికోత్సవాన్ని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శనివారం వైభవంగా నిర్వహించారు. స్వామివారికి విశేష పూజలు, అభిషేకాలు, హోమాలు జరిగాయి. శనివారం రాత్రి శ్రీవారి కల్యాణ వేడుక నిర్వహించారు. శ్రీవారిని పెండ్లి కుమారుడి గాను, అమ్మవార్లను పెండ్లి కుమార్తెలు గాను అలంకరించి వేద పండితులు, అర్చకులు శాస్త్రోక్తంగా కల్యాణం జరిపించారు. వార్షికోత్సవం సందర్భంగా ఆలయ ప్రాంగణంలో అన్న సమారాధన నిర్వహించారు. పలువురు ప్రజాప్రతినిధులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, గ్రామస్తులు స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు.

20న ఎమ్మార్పీఎస్ జిల్లా సదస్సు

నిడదవోలు రూరల్: ఎస్సీ వర్గీకరణ సాధనకు ఈనెల 20న నరసాపురంలో నిర్వహించే ఎమ్మార్పీఎస్ ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా సదస్సుకు తరలి రావాలని ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు మారుగుడి సురేష్ కోరారు. మండలంలోని సమిశ్రగూడెంలో శనివారం జరిగిన ఎమ్మార్పీఎస్ నాయకుల సమావేశంలో సురేష్ మాట్లాడుతూ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర వ్యవస్థాపక సభ్యుడు ఉసురుపాటి బ్రహ్మయ్య అధ్యక్షతన జరిగే ఈ సదస్సులో ఎస్సీ వర్గీకరణకు తీసుకోవాల్సిన కార్యాచరణపై చర్చిస్తామన్నారు.

'మానవత' ఆధ్వర్యంలో చలివేంద్రం


చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న కొవ్వూరు ఆర్టీసీ డిపో మేనేజర్ కుమార్

నల్లజర్ల: మానవత సంస్థ అందిస్తున్న సేవలు ప్రశంసనీయమని కొవ్వూరు ఆర్టీసీ డిపో మేనేజరు వైవీవీఎస్ కుమార్ కొనియాడారు. నల్లజర్ల బస్టాండులో మానవత సేవా సంస్థ ఏర్పాటు చేసిన కూలింగ్ వాటర్ చలివేంద్రాన్ని శనివారం ఆయన ప్రారంభించారు. మానవత సంస్థ సభ్యులను ఆయన అభినందించారు. కార్యక్రమంలో మానవత సంస్థ జిల్లా నియంత్రణ కమిటీ చైర్మన్ కండెపు వెంకటసూర్యనారాయణ, మండల శాఖ అధ్యక్షులు గుళ్ళపూడి వెంకటరత్నం, ఉపాధ్యక్షులు మద్దిపాటి ప్రసాద్, భోగవల్లి వెంకటసుబ్బారావు, కామిని వెంకటదుర్గా ప్రసాద్, పాతూరి సత్యనారాయణ, ఉన్నమట్ల వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

యూటీఎఫ్ ఉండ్రాజవరం మండల శాఖ సమావేశం

ఉండ్రాజవరం: ఏపీ ఐక్య ఉపాధ్యాయ సమాఖ్య (యూటీఎఫ్) మండల శాఖ సమావేశాన్ని ఉండ్రాజవరం ఉన్నత పాఠశాలలో శనివారం నిర్వహించారు. యూటీఎఫ్ మండల శాఖ అధ్యక్షుడు కె.వెంకరత్నం అధ్యక్షతన నిర్వహించిన సమావేశానికి ముఖ్య అతిథిగా జిల్లా సహాధ్యక్షుడు ఐ.రాంబాబు హాజరయ్యారు. సమావేశంలో ఉన్నత పాఠశాలలో శాఖల పని విధానాన్ని మరింత బలోపేతం దిశగా చర్చించారు.

వృద్ధాశ్రమ భవన నిర్మాణానికి విరాళం


భవన నిర్మాణానికి రూ.1.20 లక్షల విరాళం అందజేస్తున్న దాత కోయ రేవతి

దేవరపల్లి: గొల్లగూడెం వద్ద గల దివ్యాంగుల, వయోవృద్ధుల ఆశ్రమ ఆవరణలో నిర్మాణంలో ఉన్న భవన నిర్మాణాలకు దాతలు తమ వంతు సాయం చేస్తున్నారు. గోపాలపురంలోని హెచ్‌పీ పెట్రోల్ బంకు యజమాని కోయ రేవతి తన అత్త, మామల జ్ఞాపకార్థం శనివారం రూ.1.20 లక్షలు విరాళంగా అందజేశారు. యర్నగూడెంకు చెందిన మానవత స్వచ్ఛంద సంస్థ జిల్లా ప్రతినిధి బళ్ల సూర్యచక్రం 40 బస్తాల సిమెంటు ఉచితంగా అందజేశారు.

నేడు డంపింగ్ యార్డు .. రేపు పోలీసు భవనం

- ట్రీట్‌మెంట్ ప్లాంట్ ద్వారా డంపింగ్ యార్డులోని చెత్త తొలగింపు
- సగం మేర పనులు పూర్తి
- మే నెలాఖరుకు పూర్తి
- అదే స్థలంలో పట్టణ మోడల్ పోలీసు స్టేషన్ భవనం
- అక్కడే సబ్ జైలు నిర్మాణం


కొవ్వూరులో చెత్తను శుద్ధి చేస్తున్న ప్లాంట్

కొవ్వూరు: రాష్ట్ర ప్రభుత్వం చొరవతో కొవ్వూరు పురపాలక సంఘం పరిధిలో పేరుకుపోయిన చెత్తకు మోక్షం లభిస్తోంది. స్థానిక కాటన్ విగ్రహం సమీపంలో బైపాస్ రోడ్డు జంక్షన్ వద్ద ఏళ్ల తరబడి 8 వేల టన్నుల వ్యర్థాలు పేరుకుపోయాయి. స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఆధ్వర్యంలో దానిని తొలగిస్తున్నారు. ఈ డంపింగ్ యార్డులో దుర్గంధభరితమైన చెత్తను శుభ్రం చేసి తరలించేందుకు లెగసీ వేస్ట్ మేనేజ్‌మెంట్ ట్రీట్మెంగ్ ప్లాంట్‌ను తరుణ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ అనే సంస్థ నెలకొల్పింది. ఈ భారీ ట్రీట్మెంట్ ప్లాంట్ ద్వారా ప్లాస్టిక్, రబ్బర్, గాజుసీసాలు, మట్టి బెడ్డలు, రాళ్లు, మెత్తటి ఇసుక, మెడికల్ వేస్ట్ వంటి వాటిని వేరు చేసే ప్రక్రియ ప్రస్తుతం ముమ్మరంగా సాగుతోంది. ఇటీవలే కలెక్టర్ కె.మాధవీలత ఈ పనులను పరిశీలించి అధికారులకు దిశా నిర్దేశం చేశారు. వర్షాకాలానికి ముందే ట్రీట్మెంట్ ప్రక్రియను ముగించాలని ఆదేశించారు.

ఇప్పటికే సగం చెత్తకు మోక్షం

ఇక్కడున్న ఎనిమిది వేల టన్నుల చెత్తలో ఇప్పటికే సుమారు నాలుగు వేల టన్నుల వ్యర్థాల ట్రీట్మెంట్ ప్రక్రియ పూర్తయ్యిందని అధికారులు చెబుతున్నారు. రోజుకు 200 టన్నుల చెత్తను ఈ ప్లాంట్ శుద్ధి చేస్తోంది. డంపింగ్ యార్డులోని గాజు ముక్కలను వేరు చేస్తున్నారు. ట్రీట్మెంట్ ప్లాంట్ ద్వారా వచ్చిన మట్టిని ప్రభుత్వ స్థలాల మెరకకు వినియోగించుకోవాలని కలెక్టర్ సూచించారు.ఈ ప్రక్రియ ద్వారా సేకరించి విభజించబడిన ఆర్‌డీఎఫ్ (రిఫ్యూజ్ డిరైవడ్ ఫ్యూయల్) మెటీరియల్‌ను విశాఖపట్నం, గుంటూరు జిల్లాల సిమెంట్ పరిశ్రమలకు సరఫరా చేస్తున్నట్టు సంస్థ నిర్వాహకులు చెబుతున్నారు.


కొవ్వూరు పట్టణ మోడల్ పోలీసు స్టేషన్ నిర్మాణ నమునా

టౌన్ మోడల్ పోలీసు స్టేషన్‌కు స్థలం

చెత్త తొలగింపుతో ఖాళీ అయ్యే స్థలంలోని 30 సెంట్ల జాగాను టౌన్ మోడల్ పోలీసు స్టేషన్ భవన నిర్మాణానికి కేటాయించారు. ఈ భవనానికి ఇప్పటికే రూ.1.40 కోట్ల నిధులు మంజూరయ్యాయి. గత జూన్‌లోనే టెండర్ల ప్రక్రియ కూడా పూర్తయినా, చెత్తను తొలగించకపోవడం వల్ల నిర్మాణ పనులు మొదలు కాలేదు. నాలుగు వేల చదరపు గజాల్లో అత్యాధునిక హంగులతో రెండతస్తుల మోడల్ పోలీసు స్టేషన్ భవనం ఇక్కడ రూపుదిద్దుకోనుంది. ఇదే డంపింగ్ యార్డు స్థలంలో మరో 40 సెంట్లను సబ్ జైల్ నిర్మాణం కోసం కేటాయించారు. చెత్త తరలింపు పూర్తయిన కొద్ది నెలలకే ఈ ప్రాంతంలో నూతన పోలీసు స్టేషన్, సబ్ జైల్ భవనాల నిర్మాణాలు పూర్తవుతాయి.

వర్షా కాలంలోగా పనుల పూర్తి



మే నెలాఖరు నాటికి పూర్తిస్థాయిలో ఇక్కడి చెత్తను తొలగించే ప్రయత్నాల్లో ఉన్నాం. ఇక్కడి డంపింగ్ యార్డులోని చెత్తలో ఇప్పటికే సగం మేర తరలించాం. రోజుకు 200 టన్నుల చెత్తను ప్రాసెసింగ్ చేస్తున్నారు. సాధ్యమైనంత వరకూ వర్షాకాలంలోగా పనులను పూర్తి చేయాలని ప్రయత్నిస్తున్నాం.

– బి.శ్రీకాంత్, కమిషనర్, కొవ్వూరు మున్సిపాలిటీ

నిర్మాణ పనులకు సిద్ధంగా ఉన్నాం



టెండర్ల ప్రక్రియ పూర్తయ్యింది. స్థలాన్ని అప్పగించగానే మోడల్ పోలీసు స్టేషన్ భవన నిర్మాణ పనులు ప్రారంభిస్తాం. చెత్త తరలింపునకు ఇప్పటికే హోం మంత్రి తానేటి వనిత చర్యలు తీసుకున్నారు.

– బి.సంజయ్ సునీల్‌కుమార్, డీఈఈ, ఏపీ పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్

పట్టణ సుందరీకరణే లక్ష్యం



ఏళ్ల తరబడి పేరుకుపోయిన డంపింగ్ యార్డులోని చెత్త సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించాం. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చొరవతో ఈ సమస్యకు మోక్షం లభించింది. చెత్త తరలింపు ప్రక్రియ పూర్తి కాగానే ఆ స్థలంలో మోడల్ పట్టణ పోలీసు స్టేషన్ భవనాన్ని, సబ్ జైలును నిర్మిస్తారు. ఆ విధంగా వచ్చే ఏడాది ఈ ప్రాంతమంతా సుందరంగా తయారు చేయడానికి ప్రయత్నిస్తున్నాం. ఇప్పటికే రాజమహేంద్రవరం అర్బన్ డెవలప్‌మెంట్ (రుడా) ద్వారా రూ.1.50 కోట్ల వ్యయంతో ఏటిగట్టు సుందరీకరణ పనులు చేపట్టాం. ఈ ప్రాంతాన్ని సుందరీకరణ చేయడం ద్వారా పట్టణానికి కొత్త శోభ తీసుకు వస్తాం.

– తానేటి వనిత, రాష్ట్ర హోం మంత్రి

ముగిసిన టెన్త్ పరీక్షలు

కొవ్వూరు: పదో తరగతి పరీక్షలు శనివారంతో ముగిశాయి. మండలంలోని ఎనిమిది కేంద్రాల్లో శనివారం నిర్వహించిన సోషల్ స్టడీస్ పరీక్ష 1,120 మంది విద్యార్థులు రాశారు. మొత్తం 1137 మందికి గాను 27 మంది గైర్హాజరయ్యారు. ఐ.పంగిడి జెడ్పీ హైస్కూల్లో 136కి 134 మంది, కుమారదేవంలో 135కి 134 మంది, వాడపల్లి హైస్కూల్లో 210కి 209 మంది, కొవ్వూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 140కి గాను 136 మంది, పీఎంఎం హైస్కూల్లో 132కి 128 మంది, ప్రభుత్వ బాలిక ఉన్నత పాఠశాలలో 120కి 119 మంది, సర్వేపల్లి రాధాకృష్ణ హైస్కూల్లో 114కి గాను 112 మంది, దీప్తి పాఠశాలలో 150కి గాను 148 మంది విద్యార్థులు హాజరయ్యారు.

నిడదవోలు రూరల్: పదో తరగతి పరీక్షలు శనివారంతో ప్రశాంతంగా ముగిశాయి. నిడదవోలు పరిధిలోని 9 పరీక్ష కేంద్రాల్లో శనివారం నిర్వహించిన సోషల్ పరీక్షకు 1420 మంది విద్యార్థులు హాజరు కావాల్సి వుండగా 1396 మంది హాజరయ్యారు. 24 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు ఎంఈఓ కిషోర్‌కుమార్ తెలిపారు. పరీక్షలు పూర్తికావడంతో విద్యార్థులంతా ఉత్సాహంగా ఇళ్లకు వెళ్లారు.

వలంటీర్లకు నియామక పత్రాలు

దేవరపల్లి: నూతనంగా నియమితులైన తొమ్మిది మంది గ్రామ వలంటీర్లకు ఎంపీపీ కేవీకే దుర్గారావు శనివారం నియామకపత్రాలు అందజేశారు. మండలంలోని దేవరపల్లి, గౌరీపట్నం, రామన్నపాలెం, త్యాజంపూడి, సంగాయగూడెం, యర్నగూడెం, కురుకూరు గ్రామాల్లో తొమ్మిది వలంటీర్ల పోస్టుల ఖాళీలను ఇటీవల భర్తీ చేశారు. ఎంపికైన అభ్యర్థులకు నియామక పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కె.ఉమామహేశ్వరశర్మ, సొసైటీ అధ్యక్షుడు కవల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

యువత సమన్వయం పాటించాలి

- వేగేశ్వరపురంలో కొవ్వూరు డీఎస్పీ వర్మ
- గ్రామంలో భారీ ఎత్తున పోలీసు పహరా

తాళ్లపూడి: యువకులు సమన్వయం పాటించాలని, శాంతి భద్రతలకు విఘాతం కలిగించరాదని, పోలీసులకు సహకరించాలని కొవ్వూరు డీఎస్పీ వర్మ కోరారు. అంబేడ్కర్ జయంతి ర్యాలీ సందర్భంగా శుక్రవారం రాత్రి మండలంలోని వేగేశ్వరపురంలో రెండు సామాజిక వర్గాల వారి మధ్య వివాదం తలెత్తిన విషయం తెలిసిందే. మరోసారి ఘర్షణ వాతావరణం తలెత్తకుండా పెద్ద సంఖ్యలో పోలీసులు ఆ గ్రామానికి చేరుకుని శనివారం సాయంత్రం వరకు పహరా కాశారు. అయితే కొందరు యువకులు శనివారం మరోసారి రోడ్డుపై బైఠాయించి కొంతసేపు ఆందోళన చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ వర్మ మాట్లాడుతూ ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన యువకుల ఫిర్యాదు మేరకు కొందరు యువకులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశామన్నారు. కాగా కేసు నమోదు చేసిన యువకులను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్టు సమాచారం. తాళ్లపూడి ఎస్సై కె. వెంకట రమణ, కొవ్వూరు రూరల్ సీఐ, ఇతర ప్రాంతాల నుంచి సీఐలు, సిబ్బంది హాజరయ్యారు. కాగా ఇందులో ఉన్న వారంతా పదోతరగతి చదువుతున్న విద్యార్థులు కావడం గమనార్హం.


తాళ్లపూడి పోలీస్ స్టేషన్‌కు చేరుకున్న ఓ సామాజిక వర్గీయులు

ర్యాలీ చేసిన వారిపై మరో వర్గం ఫిర్యాదు

వేగేశ్వరపురంలో శుక్రవారం రెండు సామాజిక వర్గాల మధ్య ఘర్షణ తలెత్తిన నేపథ్యంలో ఆ గ్రామంలోని మరో సామాజికవర్గ నాయకులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో శనివారం తాళ్లపూడి పోలీస్ స్టేషన్‌కు తరలి వచ్చారు. అంబేడ్కర్ జయంతి సందర్భంగా శుక్రవారం ర్యాలీ చేసిన వర్గం యువత తమ ఇళ్లపై దాడి చేశారని, నివాస ప్రాంతాల్లో బీభత్సం సృష్టించారని, ఓ ఇంటి వద్ద గల మోటార్ సైకిల్‌ను కర్రలతో కొట్టి పాడు చేసి తమపైనే కేసులు పెట్టారని ఆరోపించారు. పైగా తమ మహిళలను అసభ్య పదజాలంతో దూషించారని, పలువురిని రక్తం వచ్చేలా గాయపరిచారన్నారు. ఈ మేరకు వారు కొవ్వూరు రూరల్ సీఐ రమణ, తాళ్లపూడి ఎస్సై వెంకటరమణలకు ఫిర్యాదు చేశారు. వేగేశ్వరపురం సర్పంచ్ కొమ్మిరెడ్డి వరశు రామారావు, గ్రామానికి చెందిన వివిధ పార్టీల నాయకులు కైగాల శ్రీనివాసరావు, శీర్ల సూర్యచంద్రం, తైలం పోశియ్య, తైలం బాబ్జీ, అధిక సంఖ్యలో గ్రామ యువకులు వచ్చిన వారిలో ఉన్నారు. శనివారం రాత్రి ఆ సామాజికవర్గం యువత వేగేశ్వరపురం ఆంజనేయస్వామి ఆలయం సెంటర్‌లో రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేశారు. దీంతో గ్రామంలో ఉద్రిక్త పరిస్థితి నెలకొంది.

సుపరిపాలనకు అండగా నిలవండి

- హోం మంత్రి తానేటి వనిత
- కొవ్వూరు 8వ వార్డులో గడప గడపకూ..

కొవ్వూరు: పేదల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సుపరిపాలనకు ప్రజలందరూ అండగా నిలవాలని రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత అన్నారు. కొవ్వూరు పట్టణంలోని ఎనిమిదో వార్డులో శనివారం రాత్రి గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి వైఎస్సార్ సీపీ శ్రేణులు, ప్రజాప్రతినిధులతో కలసి ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత అమలు చేసిన సంక్షేమ పథకాల ద్వారా ఆయా కుటుంబాలకు చేకూరిన మేలును ఆమె వివరించారు. సంక్షేమ పాలనతో మేలు చేస్తున్న ముఖ్యమంత్రిని మరోసారి ఆశీర్వదించాలని మంత్రి కోరారు. మునిసిపల్ చైర్‌పర్సన్ భావన రత్నకుమారి, మాజీ ఎమ్మెల్సీ కోడూరి శివరామకృష్ణ, వైస్ చైర్‌పర్సన్‌లు మన్నె పద్మ, గంద్రోతు అంజనీదేవి, పార్టీ పట్టణ శాఖ అధ్యక్ష, గౌరవాధ్యక్షులు రుత్తల భాస్కరరావు, నగళ్లపాటి శ్రీనివాస్, జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు సలాది సందీప్, ఏఎంసీ చైర్మన్ వల్లభశెట్టి శ్రీనివాస్, మాజీ చైర్మన్ బండి పట్టాభిరామారావు, జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ పోసిన శ్రీలేఖ, పార్టీ మండలశాఖ అధ్యక్షుడు సుంకర సత్యనారాయణ, ఎనిమిదో వార్డు నాయకులు వేంద్ర సూరిబాబు, ఆకుల శ్రీదేవి,గంద్రోతు శివరామకృష్ణ, మహిళా విభాగం అధ్యక్షురాలు ఏలూరి విజయలక్ష్మి, ఉప్పులూరి సూరిబాబు,గంద్రోతు కోదండ రామారావు, యాళ్ల నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.


కొవ్వూరు ఎనిమిదో వార్డులో ఓ మహిళతో మాట్లాడుతున్న హోం మంత్రి తానేటి వనిత

పక్కా ప్రణాళికతో ధాన్యం కొనుగోలు

- ఎమ్మెల్యే తలారి వెంకట్రావు
- నల్లజర్లలో కొనుగోలు కేంద్రం ప్రారంభం

నల్లజర్ల: ఖరీఫ్ సమయంలో ఎదురైన ఇబ్బందులను అధిగమించి ఈ రబీ సీజన్‌లో పక్కా ప్రణాళికతో ధాన్యాన్ని కొనుగోలు చేయాలని గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అధికారులకు సూచించారు. నల్లజర్ల-1ఆర్బీకేలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గోనె సంచులు, హమాలీలు, రవాణా వాహనాలను ముందుగా సిద్ధం చేయాలన్నారు. ఏ ధాన్యం కొనుగోలు కేంద్రం ఏ మిల్లుకు అనుసంధానం (ట్యాగ్) అయ్యిందో ముందుగా మిల్లుల వారీగా క్షేత్రస్థాయి సిబ్బందికి తెలియజేయాలన్నారు. మార్కెటింగ్, రవాణా, వ్యవసాయ, పౌరసరఫరాల శాఖల అధికారులు మిల్లర్లతో సమీక్ష జరపాల్సి ఉందన్నారు. ధాన్యంలోని తేమ శాతాన్ని నిర్ధారించే పరికరాలను అందుబాటులో ఉంచాలన్నారు. దళారులను ఆశ్రయించి మోసపోవద్దని ఈ సందర్భంగా ఎమ్మెల్యే తలారి రైతులకు సూచించారు. రైతులకు ఎక్కడైనా ఇబ్బందులు ఏర్పడితే టోల్ ఫ్రీ నంబర్లు, కంట్రోల్ రూంలను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ బంక జయలక్ష్మి, వైస్ ఎంపీపీ అచ్యుత శివాజీ, జెడ్పీటీసీ సభ్యురాలు ముప్పిడి లక్ష్మి, సొసైటీ అధ్యక్షుడు కారుమంచి రమేష్, బంక అప్పారావు, వెల్లంకి వెంకట సుబ్రహ్మణ్యం, మండల వ్యవసాయాధికారి కమల్‌రాజ్, ఎంపీడీఓ జోగేశ్వరరావు, తహసీల్దార్ కిశోర్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.


నల్లజర్లలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వెంకట్రావు


రావిమెట్లలో గోనె సంచుల దిగుమతిని పరిశీలిస్తున్న ఏఓ సత్యనారాయణ

ధాన్యం కొనుగోళ్లకు ఏర్పాట్లు

నిడదవోలు రూరల్: రైతు భరోసా కేంద్రాల ద్వారా రబీ ధాన్యం కొనుగోలుకు ఏర్పాట్లు చేసినట్లు మండల వ్యవసాయాధికారి జి.సత్యనారాయణ చెప్పారు. మండలంలోని రావిమెట్ల, సమిశ్రగూడెంలలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ మండలంలోని 22 ఆర్‌బీకేల పరిధిలో ఏ ఒక్క రైతు దళారులను ఆశ్రయించకుండా నేరుగా కనీస మద్దతు ధరకే ధాన్యం విక్రయించాలన్నారు. తొలి విడతగా 2.20 లక్షల గోనె సంచులను అందుబాటులో ఉంచామని చెప్పారు. రెవెన్యూ, సివిల్‌సప్లయ్ వ్యవసాయ శాఖల సమన్వయంతో రైతులు విక్రయించిన ధాన్యానికి సంబంధించిన ట్రక్ షీట్‌ను ఆన్‌లైన్ చేసేందుకు చర్యలు తీసుకున్నామన్నారు. ఎంపీడీఓ టి.మూర్తిబాబు, ఆర్‌బీకే సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఆర్‌బీకేల్లో విక్రయించుకోండి

తాళ్లపూడి: రబీ వరి కోతలు మొదలైనందున రైతులు తమ ధాన్యాన్ని సమీప రైతు భరోసా కేంద్రాల్లో ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకు విక్రయించుకోవాలని తహసీల్దార్ టి.రాధిక సూచించారు. మండలంలోని అన్నదేవరపేటలోని రెండు, గజ్జరం రైతు భరోసా కేంద్రాలను శనివారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ రైతుల ధాన్యానికి కనీస మద్దతు ధర క్వింటాల్‌కు ఏ గ్రేడ్‌కు రూ.2060, కామన్ రకం రూ.2040 చెల్లిస్తామన్నారు. ఆమె వెంట ఆర్‌ఐ క్రాంతి రేఖ కూడా ఉన్నారు.

చాగల్లు మండలంలో 16 కొనుగోలు కేంద్రాలు

చాగల్లు: మండలంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించామని తహసీల్దార్ కె.రాజ్యలక్ష్మి తెలిపారు. రబీ ధాన్యం కొనుగోళ్లపై స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శనివారం ఆమె అధికారులతో సమీక్ష జరిపారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలోని 16 రైతు భరోసా కేంద్రాల్లోనూ రైతుల నుంచి ధాన్యాన్ని కొనుగోలు చేయనున్నట్టు చెప్పారు. ఇందుకోసం లక్ష గోనె సంచులు అందుబాటులో ఉన్నట్టు తెలిపారు. ఏవో కె. వేణుగోపాల్ మాట్లాడుతూ ధాన్యం ఆరబెట్టి 17 శాతానికి లోపు తేమ శాతం ఉన్న రైతులకు సంచులను పంపిణీ చేస్తామన్నారు. ధాన్యం కొనుగోలులో ఏమైనా ఇబ్బందులు ఎదురైతే కంట్రోల్ రూమ్ నంబర్లు- 62815 15578, 63014 73256 కు ఫోన్ చేయాలన్నారు.

దేవరపల్లి: రబీ సీజన్‌లో పండించిన ధాన్యాన్ని ఆర్‌బీకేల ద్వారా కొనుగోలు చేస్తున్నటు తహసీల్దార్ ఎం.రామకృష్ణ తెలిపారు. 2022-23 సీజన్‌కు కొనుగోలు కేంద్రాలను శనివారం ప్రారంభించినట్టు ఆయన చెప్పారు. కొనుగోలు కేంద్రాలను ఎంపీడీఓ కె. ఉమామహేశ్వరశర్మ, వ్యవసాయాధికారి కె. విజయ్, తాను తనిఖీ చేసినట్టు తెలిపారు. కేంద్రాల వద్ద గోనెసంచులు ఏర్పాటు చేసినట్టు ఆయన చెప్పారు.

దాహార్తి తీర్చడానికి మండలానికి రూ.కోటి

- ఎమ్మెల్యే తలారి వెంకట్రావు
- నల్లజర్ల మండల పరిషత్ సమావేశం


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తలారి వెంకట్రావు

నల్లజర్ల: వేసవిలో తాగునీటి ఇబ్బందులను అధిగమించేందుకు మండలానికి రూ.కోటి చొప్పున ప్రభుత్వం నిధులు కేటాయించినట్టు గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు చెప్పారు. నల్లజర్ల మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని ఎంపీపీ బంక జయలక్ష్మి అధ్యక్షతన శనివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ వేసవిలో ఎక్కడైనా రక్షిత మంచినీటి పథకాలు పాడైనా, పైపు లైన్లు, మోటార్లకు మరమ్మతులు అవసరమైనా తక్షణం చేపట్టేలా జిల్లా పరిషత్ నిధులు మండలానికి రూ.కోటి చొప్పున కేటాయించినట్టు చెప్పారు. గడప గడపకూ మన ప్రభుత్వం పూర్తయిన గ్రామాల్లో ప్రజల నుంచి వచ్చిన విజ్ఞప్తుల మేరకు చేపట్టిన అభివృద్ధి పనులను తక్షణం చేపట్టి పూర్తిచేయాలన్నారు.గృహ నిర్మాణాలు త్వరలోనే ప్రారంభం కానున్నాయని ఎమ్మెల్యే ప్రకటించారు. లేఅవుట్లలో ముందుగా విద్యుత్ లైన్లు ఏర్పాటు చేయాలని రెవెన్యూ, పీఆర్, విద్యుత్, ఆర్‌డబ్ల్యూఎస్ శాఖలు సంయుక్తంగా పనులు ప్రారంభించి విద్యుత్, తాగునీరు సౌకర్యం కల్పించాలన్నారు. వివిధ శాఖల అధికారులు తమ శాఖల నివేదికలను సభకు సమర్పించారు. ఎంపీడీఓ జోగేశ్వరరావు, వైస్ ఎంపీపీ అచ్యుత శివాజీ, జెడ్పీటీసీ సభ్యురాలు ముప్పిడి లక్ష్మి, సొసైటీ అధ్యక్షుడు కారుమంచి రమేష్ , ఎంపీటీసీలు, సర్పంచులు పాల్గొన్నారు.

ముమ్మరంగా జగనన్నే మా భవిష్యత్తు

కొవ్వూరు: జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం కొవ్వూరులో ముమ్మరంగా సాగుతోంది. నాలుగో వార్డులో మునిసిపల్ చైర్‌పర్సన్ భావన రత్నకుమారి శనివారం పర్యటించారు. గృహ సారథులు, వలంటీర్లతో కలసి ఆమె ఇంటింటికీ వెళ్లి గత టీడీపీ పాలనకు, ప్రస్తుతం వైఎస్సార్ సీపీ పాలనకు మధ్య గల వ్యత్యాసాన్ని ప్రజలకు వివరించారు. వైఎస్సార్ సీపీ అందిస్తున్న సంక్షేమ పథకాల గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రజా మద్దతు పుస్తకంలో వారి అభిప్రాయాలను నమోదు చేసుకున్నారు. పట్టణంలో ఒకటి నుంచి నాలుగో వార్డు వరకూ, తొమ్మిది నుంచి 11వ వార్డు వరకు, 15,16, 23వ వార్డుల్లోనూ జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం నిర్వహించారు. పార్టీ పట్టణశాఖ గౌరవాధ్యక్షుడు నగళ్లపాటి శ్రీనివాస్, నాయకులు వరిగేటి సుధాకర్, మాసా ఆనంద్, నేతల వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.


కొవ్వూరు 4వ వార్డులో పర్యటిస్తున్న చైర్‌పర్సన్ రత్నకుమారి తదితరులు

చాగల్లు: జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమానికి ఇంటింటా అపూర్వ ఆదరణ లభిస్తోందని ఎంపీపీ మట్టా వీరాస్వామి అన్నారు. మార్కొండపాడులో సచివాలయ కన్వీనర్లు, వైఎస్సార్ సీపీ నాయకులు, గృహ సారథులతో కలసి శనివారం ఆయన జగనన్నే మా భవిష్యత్తు నిర్వహించారు. వారు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ అందిస్తున్న సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు.ఎంపీపీ వీరాస్వామి మాట్లాడుతూ అవినీతికి ఆస్కారం లేకుండా ప్రజా సంక్షేమ పథకాలను అమలు చేయడంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దేశానికే ఆదర్శంగా నిలిచారన్నారు. అలాగే ఊనగట్ల, చాగల్లు, చిక్కాల, బ్రాహ్మణగూడెం గ్రామాల్లో నిర్వహించిన జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్లు, ఆ పార్టీ నాయకులు, గృహ సారథులు పాల్గొన్నారు.


కోరుపల్లిలో సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు

నిడదవోలు రూరల్: జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమానికి ఇంటింటా అపూర్వ ఆదరణ లభిస్తోందని జేసీఎస్ కన్వీనర్ వెలగన పోలయ్య అన్నారు. కోరుపల్లి, గోపవరం, మునిపల్లి, తాడిమళ్ల గ్రామాల్లో 'జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ నాయకులు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులతో కలిసి ఇంటింటికీ తిరు గుతూ సంక్షేమ పథకాలను వివరించారు. సర్పంచ్ వెలగన నరేష్ ఎంపీటీసీ కర్రి సుజాత, ఈరి గంగారావు, పార్టీ నాయకులు ఆరేపల్లి చంటి, దొడ్ల మురళీకృష్ణ,నాగేశ్వరరావు పాల్గొ న్నారు.

ఉండ్రాజవరం: జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం ఉండ్రాజవరంలో ఉత్సాహంగా సాగింది. జిల్లా వ్యవసాయ సలహామండలి చైర్మన్ బూరుగుపల్లి సుబ్బారావు ఆధ్వర్యంలో వైస్ ఎంపీపీ నరహరశెట్టి సరోజిని, సర్పంచ్ మెండే వెంకట్రావు ఇంటింటికీ పర్యటించారు. సూర్యారావుపాలెంలో గృహ సారథుల మండల కన్వీనర్ కఠారి సిద్ధార్థరాజు ఆధ్వర్యంలో, కె.సావరంలో సొసైటీ చైర్మన్ నాగిరెడ్డి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీ నాయకులు, గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు పాల్గొన్నారు.